## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 6,ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మాల యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మాల యువజన సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## చిల్కేపల్లిలో బాల్య వివాహం నిలిపివేత

**ఝరాసంగం, డిసెంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిల్కేపల్లి గ్రామంలో కొనసాగుతున్న బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. జిల్లా అధికారుల వివరాల ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోహీర్ గ్రామానికి చెందిన మైనర్ బాలిక వివాహం చిల్కేపల్లిలో జరుగుతున్నట్లు తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకుని మైనర్ బాలికను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సఖి కేంద్రానికి తరలించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేస్తే వధువరుల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి శిక్షిస్తామని అధికారులు హెచ్చరించారు. వివాహం జరుపుమని ఇరు కుటుంబాలతో లిఖిత పూర్వకంగా హామి ప్రతాన్ని నయాబ్ తహసీల్దార్ యాసిన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనిత, ఎఎస్ఐ మల్లేశ్వర్‌లు రాయించుకున్నారు.


గురుకుల పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**కొహెడ, డిసెంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. కిచెన్ షెడ్, కూరగాయలు, స్టోర్ గదిలో బియ్యం,పప్పులు ఇతర వంట సామాగ్రిని పరిశీలించారు. వంట సామాగ్రిని పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. కాలం చెల్లిన సరుకులు, బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీపడొద్దన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం మాంసం అందించాలన్నారు. చదువు విషయంలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తెగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు.అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేయబోయే కంప్యూటర్ రోబోటిక్, సైన్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లను అవసరమైన గదులను సిద్దం చేయాలన్నారు.ఆయన వెంట తహశీల్దార్ సురేష్ ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అందె నాని

**చేర్యాల, డిసెంబరు 6,ప్రభాతవార్త:** జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన అందె నానిబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ఎన్నికల లో 1640 ఓట్లతో జనగామ జిల్లా ఒపెన్ క్యాటగిరిలో విజయం సాధించా. అలాగే తనకు సహకరించిన జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం నానిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునేలా చూస్తానన్నారు.

## గణేష్‌గడ్డ శ్రీసిద్ది గణపతి ఆలయ హుండీ లెక్కింపు

**హుండీ ఆదాయం రూ.28,42,481**

**అన్నదానం హుండీ ఆదాయం రూ.1,61,939**


హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

**పటాన్‌చెరు, డిసెంబరు 6, ప్రభాతవార్త:** పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ నందు స్వయంభూ వెలసిన శ్రీసిద్ది గణపతి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీసిద్ది గణపతి ఆలయానికి సంబంధించిన 100 రోజుల హుండీ ఆదాయం రూ.28,42,481 (ఇరవై ఎనిమిది లక్షల నలభై రెండు వేల నాలుగు వందల ఎనభై ఒక రూపాయలు), అలాగే అన్న దానం హుండీ ఆదాయం రూ.161,939 (ఒక లక్ష అరవై ఒక వేల తొమ్మిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు) వచ్చినది ఈఓ ఎన్.లావణ్య తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ, అజయ్ శర్మ, అయ్యప్ప పంతులు, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలు

**టేక్మాల్, డిసెంబరు 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాద్లూర్ గ్రామంలో దివంగత ఉపాధ్యాయులు భూంపల్లి రాజయ్య జ్ఞాపకార్థకంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు మూడు రోజులపాటు కొనసాగాయి. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోరా హోరీగా కొనసాగిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం 80 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి సంగారెడ్డి ప్రవీణ్ టీంకు రూ. 20116 రెండవ సంగారెడ్డి సోయల్ టీం రూ. 10116 బహుమతి మూడవ బహుమతి మెదక్ పోలీస్ టీంకు రూ. 50116 నాలుగవ బహుమతి వడ్డేపల్లి రూ. 20116 లకు ఎంపీ ఎమ్మెల్యే చేతుల మీదగా బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీ సురేష్ శెట్కర్ మాట్లాడుతూ బోంపల్లి రాజయ్య సేవలు చిరస్మణీయమన్నారు. ఆయన జ్ఞాపకర్థంగా జిల్లా స్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం పట్ల వారి కుటుంబ సభ్యులను, ముఖ్య నిర్వాహకుడు తనయుడు అనిల్‌కుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో జోగిపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి వైస్ చైర్మన్ సత్యనారాయణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌రావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాన్ కిషన్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ మజార్, మండల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకులపల్లి పాపయ్య, సర్వని లక్ష్మణ్ , తలారి అవినాష్ ,సాగర్,మాధవచారి,రాందాస్,అమిరోద్దిన్, రమేష్, సహాదేవ్, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ బొంపల్లి రాజయ్య కుటుంబ సభ్యులు, పిటీలు ఉపాధ్యాయులు విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

## విద్యుత్ వినియోగదారులకు వరం 'గృహజ్యోతి'

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 6 ప్రభాతవార్త:** గృహజ్యోతి పథకం విద్యుత్ వినియోగదారుల పాలిట వరం అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని టీఎస్ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు ఆరవ రోజులో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గృహజ్యోతి పథకంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 26వేల గృహాలకు 31.36 కోట్ల వరకు గృహ జ్యోతి విద్యుత్ వినియోగదారులు వినియోగించుకున్నారని, ఇంకా 12 వేల మంది గృహ జ్యోతిలో నమోదు కావాల్సి ఉందని, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులను నియమించి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు 92.72 కోట్లు ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 3.35 కోట్లు, నాయి బ్రాహ్మణులు, రజకులకు 3.22 కోట్లు విద్యుత్ వినియోగం ద్వారా లబ్ది చేకూరిందని అన్నారు. జిల్లాలో వంద శాతం గృహజ్యోతి పథకం అమలైందని చెప్పారు. కరెంటు రైతులకు కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ అందించి సమృద్ధిగా పంటలు పండించడం జరిగిందని పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకంటే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లు అందిస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమమే ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీల పథకాలను అమలు చేస్తుందన్నారు. రజకులకు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు గృహ జ్యోతి ఉచిత విద్యుత్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలో 8 సబ్ స్టేషన్‌లు కొత్తగా రావడం జరుగుతుందని, 25 కేవీ, 63, 160 ట్రాన్స్ఫార్మర్‌లలో వోల్టేజ్ నిర్మూలనకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సమావేశాలలో మాట్లాడిన విధంగా ప్రభుత్వ పథకాల ద్వారా 500 రూపాయలకు వంటగ్యాస్, ఫ్రీబస్, గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఈ పథకాల ద్వారా ఒక కుటుంబం నెలకు 10,000 ఆదాయం రాయితీ పొందుతున్నారని చెప్పారు. కరెంటు కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ అందిస్తూ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తూ ప్రజలకు సహాయ, సహకారాలు అందిస్తున్న విద్యుత్ శాఖ సేవలు అభినందనీయమని కొనియాడారు. జిల్లాలో గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సూపరింటెండెంట్ డిస్కం శంకర్, డీఈ ఆపరేషన్ మెదక్ చాన్ షరీఫ్ బాషా, తూప్రాన్ డీఈ ఆపరేషన్ గరుత్మంత రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

## హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే : మాజీ ఎమ్మెల్యే

**చేర్యాల, డిసెంబరు 6,ప్రభాతవార్త :** ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడాదిలోపే నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తుడంతో ( ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా శుక్రవారం షాదీఖానలో ఏర్పాటు చేసుకున్న కార్యకర్తల సమావేశంలో జనగామ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణాను అప్పుల రాష్ట్రంగా కేసీఆర్ చేశాడన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని అక్రమాలు, అవినీతేనని తెలిపారు.అప్పటి ప్రభుత్వ హాయంలో తప్పుడు పనులు చేసిన వారికి జైలు శిక్ష తప్పదన్నారు.ఒకప్పుడు హరీష్‌రావుకు చెప్పులు కూడా లేకుంటే తనే కొనిచ్చానని ఇప్పుడు ఇన్ని కోట్ల రూపాయలు ఎలా వచ్చాయన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నీళ్లు సిద్దిపేటకు తరలించుకుపోయి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశాడన్నారు. ఈ నాలుగు మండలాలను సిద్దిపేట జిల్లాలో కలిపి ఆగం చేశాడని ఆరోపించారు. పదవులున్నా లేకున్నా ఈ ప్రాంత ప్రజలకు సేవచేయడమే తన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల, మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిన హామీలను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజల దృష్టికి తీసుకెళ్లి వివరించాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంగడి బజార్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### చెరువులు కబ్జాచేసి కళాశాలలు కట్టిన పల్లా...

**ప్రజాపాలన విజయోత్సవ నియోజకవర్గ ఇంచార్జీ శ్రీనివాస్‌రావు**

దొంగ ఓట్లతో గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి తను కేసీఆర్ బినామని, చెరువులను కబ్జాచేసి కళాశాలలు కట్టిన ఘనుడని ప్రజాపాలన విజయోత్సవ నియోజకవర్గ ఇంచార్జీ శ్రీనివాస్‌రావు మండిపడ్డాడు. గత ప్రభుత్వ హాయంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు.అనంతరం కార్యకర్తలను ఉద్దేశ్యించి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాదిలోపే పూర్తి చేసిందని దానిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు.బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టాలని,ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పూర్మ ఆగంరెడ్డి, మంచాల చిరంజీవులు,కౌన్సిలర్లు తుమ్మలపల్లి లీల సంజీవులు, ఆడెపు నరేందర్, చెవిటి లింగం నాయకులు ముస్త్యాల కిష్టయ్య, మేర్గు శ్రీనివాస్, దాసరి కళావతి, రాకేష్ కృష్ణ, కర్క సంతోష్‌రెడ్డి, తాటికొండ సదానందం, అందె నానిబాబు, ఖాత శ్రీను, దాసరి శ్రీకాంత్, జహీరోద్దీన్, అంబటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూరారంలో తరగతి గదులకు భూమి పూజ

**చిన్నశంకరంపేట, డిసెంబరు 6,ప్రభాతవార్త:** మండల పరిధి సూరారంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో అదనపు గదులు మూత్రశాలలు నిర్మించాలని ప్రదానోపాధ్యాయుడు సాయిరెడ్డి ఎస్‌టీ పరిశ్రమ హైదరబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులను కోరగా స్పందించిన యజమాన్యం సీఎస్‌ఆర్ నిధుల ద్వారా మూడు తరగతి గదులు, మూత్రశాలల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. పరిశ్రమ సిబ్బంది చైతన్య, లోకేష్‌లను గ్రామస్తులు అభినందించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ముందుకు వచ్చిన పరిశ్రమ యజమాన్యాన్ని డీఈవో రాధాకిషన్ అభినందించారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల వారు ముందుకు వచ్చి పాఠశాలలను దత్తత తిసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నీరజ, పంచాయతీ కార్యదర్శి నాంపల్లి, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, మాదవి, రవి, లక్ష్మీనారాయణ, వెంకటేష్, ఆఫీస్ పాల్గోన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన అంకిత

**చిన్నశంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**

మండల పరిధి మదూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అంకిత జాతీయ స్థాయి వాలీబాల్ ఆటకు ఎంపికైనట్లు ప్రదానోపాధ్యాయుడు రవిందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల చెగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అడర్ -14 వాలిబాల్ ఆటలో అంకిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది.

ఈ నెల 10-14వ తేదిలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర, వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో జరగబోయే జాతీయ స్థాయి వాలీబాల్ ఆటలో పాల్గొంటుందని వ్యాయమ ఉపాధ్యాయుడు నరేష్ తెలిపారు. వారణాసి వెళ్లడానికి ఖర్చుల నిమిత్తం పాఠశాల ఉపాధ్యాయులు కలిసి రూ.3వేల రుపాయలను అందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థినికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్, నాగరాజు, శ్రీనివాస్, రమేష్, రాములు ఆంజనేయులు, శివ, పవన్, ప్రసాద్, నరేందర్, రాజు, శ్రవణ్, ఉమాకాంత్ అభినందించారు.


ఎంపికైన నికితకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**


విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, డిసెంబరు 6,ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో అలసత్వం వహించొద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆదర్శ పాఠశాలను, అలాగే కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 105 ప్రభుత్వ వసతి గృహలను ప్రత్యేక అధికారులు సందర్శించారని తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. స్టోర్‌రూం, కూరగాలయ నాణ్యత, పప్పు దినుసులు, ఆహారపదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కాలం చెల్లిన సరుకులను వాడోద్దని, వీటివల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వండిన తర్వాత ఆహర పదార్థాల నాణ్యతను రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. వసతి గృహాల్లో కూరగాయల నిల్వ,వంట పాత్రలను శుభ్రం చేయడం, విద్యార్థులకు ఎలా వడ్డిస్తున్నారో వంటి అంశాలను పొందుపర్చి నివేదిక అందించినట్లు ఆయన తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో మూత్రశాలలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఖర్చుతో కూడుకున్న ప్రతి పనులు వివరాల పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి వసతి గృహంలోని మూత్రశాల,వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, వంట చేసేవాళ్లు పాత్రలను శుభ్రంగా ఉంచుతున్నారని చెప్పారు. మండల ప్రత్యేక అధికారుల చేత నిత్యం వసతి గృహలను పరిశీలించాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో వంటశాలలు శుభ్రంగా ఉన్నాయన్నారు. ఆదర్శ పాఠశాలలో మంచి నీటి సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, పాఠశాలకు సమీపంలో ఉన్న పెద్ద గుడి నుండి నీటిని విద్యార్థులకు అందిస్తున్నామని పట్టణ మాజీ సర్పంచి కలెక్టర్ దృష్టికి తిసుకెళ్లగా పాఠశాలలో బోరు వేయిస్తామని హామి ఇచ్చారు. అనంతరం కేజీబివి పాఠశాల, వసతి గృహన్ని తనిఖీ చేసి పిల్లలకు వడ్డించే వంటలను పరిశీలించారు. మూత్రశాలలు, వంటశాలలు, కూరగాయలు శుభ్రంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసి, ఎప్పుడూ ఇలానే కొనసాగించాలని తెలిపారు. ప్రధాన రహదారి నుండి కస్తూర్బా పాఠశాల వరకు రావడానికి రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని సీసీ రోడ్డును నిర్మించాలని ప్రిన్సిపల్ గీత కలెక్టర్ దృష్టికి తిసుకెళ్లగా త్వరలో సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామి ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్‌లు పాల్గొన్నారు.


తాడ్దానిపల్లి వద్ద ఉద్రిక్తతను అదుపులోకి తెస్తున్న పోలీసులు

## టోల్ ప్లాజా వద్ద ఉద్రిక్తత

**-సిబ్బందికి, వాహదారుడికి మధ్య ఘర్షణ..కార్యాలయం ధ్వంసం**

**చౌటకూరు, డిసెంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వాహనదారుడికి టోల్ ప్లాజా సిబ్బందికి మధ్య టోల్ రుసుం చెల్లింపు విషయంలో తెలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం...జోగిపేట పట్టణానికి చెందిన కట్కం వినయ్(25) స్నేహితులతో కలిసి ఎక్స్‌యూవీ 700 కారులో సంగారెడ్డికి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వెళుతుండగా టోల్ ప్లాజా వద్ద రుసుం చెల్లించమని సిబ్బంది వినయ్‌కు సూచించగా తన లోకల్ కిందకు వస్తానని, తన వాహనానికి ఇంకా రిజిస్ట్రేషన్ కానందున ఫాస్ట్ టాగ్ వేయలేకపోయానని పేర్కనగా సిబ్బంది రుసుం చెల్లిస్తేనే వావహాన్ని వదులుతామని పేర్కనడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో ఆగ్రహంతో వినయ్ సిబ్బందిపై చేయిచేసుకున్నాడు. తనపై దాడి చేస్తావా అంటూ సిబ్బంది వినయ్‌పై రాడ్‌తో దాడి చేయడంతో వినయ్ తలకు బలమైన గాయాలు అయ్యాయి. అటుగా వెళుతున్న జోగిపేట యువకులు టోల్ ప్లాజా వద్దకు చేరుకుని సిబ్బందిపై దాడి చేసి కార్యాలయ అద్దాలను ధ్వంసం చేశారు. ఘర్షణలో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ సంఘటన స్థలానికి చేరుకుని ఉద్రిక్తతను అదుపులోకి తెచ్చారు. టోల్ ప్లాజా వద్ద గంటకు పైగా ఘర్షణ చోటుచేసుకోవడంతో రాకపోకలకు అంతరాయం కావడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణీకులు పాట్లు పాడాల్సి వచ్చింది.

## కోహెడలో నార్కొటిక్ డాగ్స్‌తో తనిఖీలు


కోహెడలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**కోహెడ, డిసెంబరు 6, ప్రభాతవార్త :** సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణలో భాగంగా నార్కొటెక్స్ డాగ్స్‌తో ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేక అక్రమంగా రవాణా చేసిన పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా అమ్మిన వెంటనే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## మొక్కజొన్న పంటను పరిశీలించిన ఎవో

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలో ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనాథ్ శుక్రవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు లక్షణాలను గమనించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కజొన్న సాగులో అనేక రకాల చీడపీడలు తరచూ పంటను అశిస్తూ పంట నష్టం కలిగిస్తాయన్నారు. కత్తెర పురుగు పురుగు మందులకు కూడా లొంగని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో రైతులు కత్తెర పురుగును నివారించడానికి కొన్ని మెరుగైన యజమాన్య పద్దతులను పాటించాలన్నారు. విత్తనం నాటిన 15 నుంచి 20 రోజుల్లో ప్రొఫెనోపాస్ 250 మిల్లీలీటరు ఒక లీటరు వేపనూనె 200 లీటర్ల నీటిలో కలిసి మిశ్రమాన్ని చల్లుకోవాలన్నారు. 20 నుంచి 30 రోజుల మధ్యలో ఎకరానికి ఇమామెక్టిన్ బెంజెయట్ 100 గ్రాములు, లీటరు వేపనూనె 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ప్రతాప్‌రెడ్డి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలిమృతి శుక్రవారం చెందినట్లు పోలీసులు, గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి బోర్ మోటార్ అన్ చేయగా మోటార్ నడవకపోవడంతో తన పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ బంపర్ వైర్ తెగి ఆన్ ఆఫ్ రాడ్డుపై పడడంతో విద్యుత్ షాక్ తగిలినట్లు తెలిపారు.వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు చూసి ప్రతాప్‌రెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

**కొమురవెల్లి, డిసెంబరు 6, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన రైతు పోతుగంటి రవివర్ధన్‌కు చెందిన ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి శుక్రవారం మృతిచెందింది.రూ.120000 ఆస్థినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మృతి చెందిన ఆవు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## రాష్ట్రంలో నియంత పాలన

**బెజ్జంకి, డిసెంబరు 6, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులకు పాల్పడడం నియంత పాలనకు నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే పాడ కౌశిక్‌రెడ్డిల అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేవారు లేరని ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలనసాగిస్తుందన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, కచ్చు రాజయ్య, చింతకింది శ్రీనివాస్‌గుప్త, ముక్కిస తిరుపతిరెడ్డి, నలువాల స్వామి, బొల్లం శ్రీధర్, వంగల నరేష్, దీటి బాలనర్సు, దీటి రాజు, బిగల్ల మోహన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీల ఎన్నిక



నూతన కమిటీ

**బెజ్జంకి, డిసెంబరు 6, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా నూతన గ్రామ కమిటీల ఏర్పాటు నిమిత్తం మండల ఇన్‌చార్జి చింతకింది పర్శరాములు ఆధ్వర్యంలో శుక్రవారం వీరాపూర్, పెరుకబండ గ్రామాల్లో నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరాపూర్ గ్రామ అధ్యక్షుడిగా చిలుముల రవీందర్, ఉపాధ్యక్షులుగా గాలిపెల్లి శ్రీనివాస్, రడం శ్రీనివాస్‌లను పెరుకబండ గ్రామ అధ్యక్షుడిగా కొంపల్లి సుమన్, ఉపాధ్యక్షులుగా వడ్లూరి రామచంద్రం, కొంపెల్లి స్వామిలను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు తాడిచెట్టు భూమయ్య, వడ్లూరి పర్శరాములు, బోనగిరి గంగరాం, అనంద్, లింగాల బాబు, కళ్లేపల్లి గ్రామ అధ్యక్షుడు మాంకాల రాజు, కర్రావుల మల్లేశం పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘన విజయం

**-టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు**



నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నాయకులతో శ్రీకాంత్‌రావు

**గజ్వేల్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):** యువజన కాంగ్రెస్ నాయకులను టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా అనిల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు, అలాగే గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో గెలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఒడిదుడుకులకు ఎదురైనా కష్టాలను ఎదుర్కొని యువజన కాంగ్రెస్ విభాగం ఎన్నికల్లో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వివిధ మండలాల ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, నందకుమార్, కిషోర్, సమీర్, సాయికుమార్, ఉమామహేశ్వర్, రాజు, సూరజ్, సల్మాన్, శ్రావణ్, దాసు, సింగం స్వామి, రవి, ప్రభుదాస్, కిరణ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, లీగల్ సెల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్‌రావు, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రావు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్, ప్రవీణ్, ఎండి.జానీ, ప్రవీణ్, క్యాసారం బాబా, మామిడి కృష్ణ, కిషోర్, రతన్, రాజు, భాను, జాలిగామ శ్రీనివాస్, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లావెంకటాపూర్ పాఠశాలలో మాక్ అసెంబ్లీ



పాఠశాలలో మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

**గజ్వేల్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులచే మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎంగా విద్యార్థిని శ్రీజ, ప్రతిపక్ష నేతగా ప్రవళిక, మంత్రులుగా కావేరి, సాయి, సాత్విక, హారిక, ఆనంద్, లక్ష్మీగణపతి, వరుణ్‌తేజ్, హర్షిత్, మనోజ్, ఎమ్మెల్యేలుగా అయేషా, వైష్ణవి, మనస్విని, అభిలాష్, శ్రీజ, అంజలి, అభిషేక్‌లు వ్యవహరించారు. విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించడాన్ని వీక్షించి అభినందించారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-పట్టణ ప్రధాన కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నక్క రాములుగౌడ్**

**గజ్వేల్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నక్క రాములుగౌడ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సహకారంతో ఇందిరమ్మ కమిటీలో సభ్యునిగాచేరడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్‌లో జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లలో బడుగు, బలహీన వర్గాలకు పారదర్శకత వ్యవహరించి కృషిచేస్తానన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యునిగా తీసుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లకు రుణపడి ఉంటానని తెలిపారు. నర్సారెడ్డి నాయకత్వంలో పనిచేస్తామని స్పష్టం చేశారు.



రాములుగౌడ్‌ను సన్మానిస్తున్న మేయర్, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



సిద్దిపేటలో అంబేద్కర్‌విగ్రహానికి పూలమాలలువేసి దృశ్యం



బిఆర్ఎస్ ఆధ్వర్యంలో...



గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి...



ఎర్రవల్లిలో అంబేద్కర్‌విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట జిల్లాలోని ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం అయన సేవలను కొనియాడారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో డా. బిఆర్.అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లో గల ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు దరిపల్లి చంద్రం, అత్తు, సాకి అనంద్, రియాజ్, గయాజుద్దీన్, మధు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో...**

బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో డా. బిఆర్.అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి సంపత్‌రెడ్డి. కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, అంబేద్కర్ సంఘం నాయకులు రాములు, భీమసేనా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో...**

యుజవన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. డిసిసి ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఎన్ఈడబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో...**

నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సొసైటీ నాయకులు ములుగు బాలరాజు, ఎస్.కనకయ్య, నవీన్, నర్సింలు, బాలకిషన్, శివయ్య, బాబు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో...**

సిద్దిపేట న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌హాల్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కాంతారావు, బార్‌అసోయేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, కర్రోళ్ల బాబు, సూర్యకళ, బాలయ్య, తుంగ కనకయ్య, బాపురావు, ఆత్మరాములు, మల్లికార్జున్, ఆదినారాయణయాదవ్, కమాలుద్దీన్, బాబు, సాగర్, లావణ్య, అనురాధ పాల్గొన్నారు.

**బెజ్జంకి మండలంలో...**

**బెజ్జంకి, డిసెంబరు 6, ప్రభాతవార్త:** బిఆర్.అంబేద్కర్ 68 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అధ్యక్షతన అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలపరిధిలోని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):** ప్రపంచంలోనే ప్రతిభగల విద్యావంతుడు, మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని, ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ జెడ్‌పిటిసి బొల్లారం ఎల్లయ్య, దళిత సంఘాల నాయకులు బొగ్గుల చందు, పొన్నాల కుమార్, బిఆర్ఎస్‌నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, సుభాష్‌చంద్రబోస్, కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, జంగం రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, మోహన్, దప్పు గణేష్, సురేష్, శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దమ్మని ఎల్లయ్య, దళిత సంఘాలనేతలు పాల్గొన్నారు.

**ప్రజ్ఞాపూర్‌లో...**

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు శివులు మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు డాకని బిక్షపతి, చిత్ర ఆర్ట్స్ నర్సింలు, గుండ్ర సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**మర్కుక్‌లో...**

**మర్కుక్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):** మతోన్మాద శక్తుల నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లిలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం కెవిపిఎస్ మర్కుక్ మండల అధ్యక్షుడు పొట్టోల్ల దాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రాలలో దళితులపై దాడులు అనేకం జరుగుతున్నాయని, దాడులు అరికట్టాలని కుల వివక్షత చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, సీనియర్ జర్నలిస్టులు తుమ్మ కృష్ణ, మొండి బిక్షపతి, డి.కృష్ణ, పరశురాం, నరేష్, మొండి రమేష్, కమ్మరి సాయి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి...



ఉపాధ్యాయుడిపై డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న చంద శ్రీకాంత్

## వడ్డీ వ్యాపారం చేస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

**చేర్యాల, డిసెంబరు 6,ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన బస్వారాజు కనకయ్య అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రజలకు డబ్బులు వడ్డీలకు ఇస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మాల మహానాడు సిద్దిపేట జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ ఆరోపించారు. చిరు వ్యాపారులను ఆసరగా చేసుకుని డబ్బులు ఇస్తూ అధికంగా వడ్డీ వసూలు చేయడమే కాక తన దగ్గర డబ్బులు తీసుకుని చెల్లించాక వ్రాసుకున్న కాగితాన్ని ఇవ్వకుండా తన దగ్గరే ఉంచుకుని మళ్ళీ అడుగుతున్నాడని తెలిపారు. తనపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సిద్దిపేట జిల్లా విద్యాశాఖధికారిని కలిసి ఉపాధ్యాయుడిపై శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. తన వల్ల కొంత మంది మానసింగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునే పరిస్థితులున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాజ్యాంగ హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

**సిపిఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ**

**నర్సాపూర్ డిసెంబరు 6 ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా రాజ్యాంగ విలువలు, హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ భారతదేశంలో మత పరమైన, కుల పరమైన విద్వేషాలు రూపుమాపలేదని పాలకులపై మండిపడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మారుస్తామని, మతోన్మాద చర్యలు చేపడుతు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందని గుర్తుచేశారు. అంబేద్కర్ అనేక ఉద్యమాలతో సాధించిన అనేక హక్కులను కాలరాయాలని చూస్తుందని ఇప్పటికైనా విద్వేషాలు పెంచకుండా లౌకిక విలువలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం బీఎస్పీ మాలమహానాడునాయకులు కడారి నాగరాజు, కల్లూరి సంజీవ, మైసయ్య, మణయ్య, నరేష్, యాదగిరి, రమేష్, నర్సింలు, సంతోష్ పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ తదితరులు

## ప్రజల ప్రశంసలు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హత్నూర డిసెంబరు 6, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరైందని ఆ పార్టీ మండలం అధ్యక్షుడు కర్రె కృష్ణ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం అవుతున్న సందర్భంగా అయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ హామీలలో భాగంగా ఉచిత కరెంట్, ఫ్రీ బస్సు సౌకర్యం, రైతులకు రుణమాఫీ, పంటలకు బోనస్ తదితర కార్యాక్రమాలు చేపట్టిందని అన్నారు. రాబోయే నాలుగ సంవత్సరాలలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంను దేశంలోనే మొదటి స్థానంలో నెలబెట్టెందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తూన్నారని అన్నారు. సమావేశంలో కర్రె కృష్ణతోపాటు మండల పార్టీ నాయకుల పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : శ్రీనివాస్



ప్రజాపాలన విజయోత్సవాలలో మాట్లాడుతున్న శ్రీనివాస్

**కొమురవెల్లి, డిసెంబరు 6, ప్రభాతవార్త :** ఎన్నికల సమ యంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఉద్యోగల భర్తీ, నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయడంతో పాటు రేషన్ షాపుల్లో పేదలకు సన్న రకం బియ్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఘన సత్కారం

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 6, ప్రభాతవార్త :** ఇటీవల హైదారాబాద్‌లో పెద్ద యెత్తున జరిగిన మాలల సింహగర్జన సభ విజయవంతం అయినా సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని సిద్దిపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాకి అనంద్ శుక్రవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కారించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలను ఒక్క తాటిపైకి తెచ్చినందులకు వివేక్‌వెంకటస్వాకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నవీన్, నటరాజు, కిషన్ ఉన్నారు.



ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు అనంద్



పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నారాయణరావు

## పర్యావరణ కాలుష్యంతో మానవ మనుగడకే ముప్పు

**గజ్వేల్, డిసెంబరు 6(ప్రభాతవార్త):** పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద జాతీయ కాలుష్య నియంత్రణ వారోత్సవాలలో భాగంగా వాహనదారులకు పర్యావరణ, శబ్ద, వాహనాల కాలుష్యం వల్ల మనిషి మనుగడకు ముప్పు ఉందని సిద్దిపేట జిల్లా నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో పర్యావరణ కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలు చెడిపోతున్నాయన్నారు. దేశంలోనే హైదరాబాద్ కాలుష్యంలో 7వ స్థానంలో ఉందని, అప్రమత్తంగా ఉండాలని, లేదంటే మనిషి జీవన ప్రమాణస్థాయిని తగ్గిస్తుందన్నారు. అనంతరం గజ్వేల్ క్లస్టర్ పరిధిలోని వైద్య సిబ్బందికి పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, శ్రీగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బల్వీర్‌సింగ్, సిహెచ్ఓ కె.రవీందర్ రెడ్డి, జిల్లా ఎన్‌సిడి కో-ఆర్డినేటర్స్ డి.రాజేందర్, టి.వెంకటరమణ, ఫార్మసిస్ట్ నర్సింలు, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ల్యాబ్ టెక్నీషియన్ రాము తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ నిర్మాణ దార్శనికుడు అంబేద్కర్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, డిసెంబరు 6,ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తిగల రామచంద్రం అన్నారు. శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బందెల సాయిలు, మల్లేషం, దుర్గపతి, సత్యం, మురళి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**పటాన్ చెరు, డిసెంబరు 6,ప్రభాతవార్త:** పటాన్ చెరు, అంటరానితనాన్ని రూపుమాపి అన్ని వర్గాల సమానత్వం కోసం జాతిని జాగృతం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమురగూడెం వెంకటేష్ అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 68 వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సేవా సంఘం పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలు వేసి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో అసమానతలు తొలగించి, ప్రతిఒక్కరికి సమానత్వం, సౌభ్రాతత్వం, రిజర్వేషన్లు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అన్ని వర్గాల వారికి సమన్యాయం జరగాలనే తలంపు తో రాజ్యాంగాన్ని రూపొందించాడని తెలిపారు, సమాజంలో సామాజిక అసమానతలు రూపుమాపితేనే అభివృద్ధి పథంలో పయనిస్తామని నమ్మి ఆనాడే రాజ్యాంగంలో బడుగు వర్గాలకు ప్రాధాన్యతనిచ్చిన అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, అంబేద్కర్ యువజన సేవ సంఘం సభ్యులు రుద్రారం శంకర్ వెంకటేష్, బల్వంత్, యాదయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు కొమర గూడెం వెంకటేష్

# తడి, పొడి చెత్త వేరుచేసి సిబ్బందికి సహకరించాలి

**మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి**

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 6 (ప్రభాతవార్త):**

తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తపై శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6, 19 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ తడి చెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తపై వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే ప్రజలకు తడి, పొడి చెత్త, హానికరమైన చెత్త వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత కోసం ప్రతి వారానికి రెండు గంటల పాటు శ్రమదానం చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ స్వచ్ఛ వాహనానికి అందించాలన్నారు. తడి, పొడి, హానికర చెత్త సేకరణలో భాగస్వాములై స్వచ్ఛగజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌కు కృషి చేయాలన్నారు. చెత్తను రోడ్డుపై, మురికి కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు. అలా వేసిన వారిని గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే రోజుకొక వార్డులో ఈ అవగాహన కార్యక్రమం ఉంటుందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. అండర్ డ్రైనేజీలో కూడా ప్లాస్టిక్, పేపర్లు, ఇతర వస్తువులు వేయకూడదని తెలిపారు. అనంతరం తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసిన వారిని మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి రజితగౌడ్, 19వ వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, వార్డు సభ్యులు, మెప్మా సీఓ సరిత, ఆర్‌పిలు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న రాజమౌళి, నర్సయ్య

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పెద్ద శంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సతీష్ అవగాహన కల్పించారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల జరుగుతున్న మోసాలపై ఆయన అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం, షీ టీమ్ పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. వికలాంగ విద్యార్థులకు పలు సూచన లు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, పిజిహెచ్‌ఎం రాజేశ్వర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విఠల్, ఎస్ఆర్‌పి ప్రసన్న, ఎంఐఎస్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా గణపతి విగ్రహప్రతిష్ఠ

**పెద్దశంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని శ్రీమాణిక్‌ప్రభు దేవాలయంలో గణపతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పురోహితులు క్రిష్ణశర్మ అధ్వర్యంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేపట్టారు. త్వరలో జరగనున్న దత్తజయంతి, సప్తాహ కార్యక్రమం సందర్భంగా పట్టణానికి చెందిన విగ్రం రాజన్‌గౌడ్ గురుచరిత్ర పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పున్నయ్య, సర్వేశ్వర్, సీతారం, రవివర్మ, సతీష్ గౌడ్, రామక్రిష్ణ, సత్యనారాయణ, సాయితేజ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆలయ ప్రధానద్వార స్థాపన



వేణుగోపాలస్వామి ఆలయ ప్రధానద్వార స్థాపన కార్యక్రమం దృశ్యం

**పెద్ద శంకరంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా శుక్రవారం ఆలయ ధర్మకర్తలు ఆలయ ప్రధానద్వార స్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదబ్రాహ్మణ పండితులచే కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 250సంవత్సరాల చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి ఆలయమంటపం, గోపురభాగం పాక్షికంగా దెబ్బతినడంతో ఆలయ ధర్మకర్తలు ఆలయాన్ని తొలగించి అదేస్థానంలో సుమారు 2కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే బాలాలయం నిర్మించి దానిలో వేణుగోపాలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి స్వామివారికి నిత్య పూజలతో పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, వైకుంఠ ఏకాదశి రోజులలో ఆలయాన్ని సుందరంగా అలంకరించి ప్రతి ఏటా పెద్ద ఎత్తున వేడుకలు జరుపుతున్నారు. ఆలయ ధర్మకర్తలు స్వర్గీయ శేషాచారి పంతులు కుమారులు సొంతనిధులతో ఆలయ పునర్నిర్మాణపనులను చేపట్టారు. నిర్మాణంలో అధిక భాగం పనులు పూర్తయ్యాయని, వచ్చే ఉగాది నాటికి పూర్తి నిర్మాణం జరుగుతుందని వారు తెలిపారు.

## రేపు ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్య శిబిరం

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
రామాయం పేట పట్టణంలోని సత్యసాయి సేవాసదనం ఆధ్వర్యంలో రేపు ఆదివారం ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది అరుదైన మెడికల్ క్యాంపు అని, ఈ సేవాశిబిరంలో ఆపరేషన్ అవసరమైన వారికి అతితక్కువ ప్యాకేజ్‌నందు లేజర్ ట్రీట్ మెంట్ చేస్తారన్నారు. అందుకు హైదరాబాద్ వెళ్లడానికి, రావడానికి రవాణాసౌకర్యం ఉచితంగా ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఉబ్బిపోయి మెలికలు తిరిగిన నరాలు, స్పైడర్ నరాలు లాంటి వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా వైద్యం చేస్తున్నామన్నారు. ఈ వైద్యశిబిరంలో రూ.4500 రూపాయల విలువగల కలర్ డాప్లర్ అల్ట్రా సౌండ్ పరీక్షలు, 5వేల రూపాయల విలువగల రక్తనాళాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయబడునని తెలిపారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని శ్రీసత్యసాయి సేవాసదనం, సాయినగర్‌నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటలవరకు శిబిరం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలే కాకుండా మండలపరిధిలోని వివిధ గ్రామాలకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలని సాయిసదనం నిర్వాహ కులు యెనిశెట్టి గౌరిశంకర్ కోరారు.

## కస్తూర్బా పాఠశాల వద్ద గ్రామస్థుల ఆందోళన



కస్తూర్బా పాఠశాల గేటు ముందర బైఠాయించిన దృశ్యం

**రామాయంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో హాస్టల్ భవనంపై నుండి కిందపడిన బాలికకు సరైనవైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్థులు, స్థానిక బిజెపి నాయకులు ఆందోళన చేపట్టారు. కస్తూర్బాగాంధీ విద్యాలయం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాలికకు గాయాలైన విషయంలో అధికారులు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పైనుంచి పడిన బాలికను మెట్లపైనుంచి పడినట్లు తప్పుడుసమాచారం అందించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాలికకు సరైనవైద్యం అందడంలేదని ఆవేదన చెందారు. విషయం తెలుసుకొని రామాయంపేట ఎస్ఐ బాలరాజు, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని, బాలికకు సరైనవైద్యం అందించేందుకు కృషిచేస్తున్నామని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. దీంతో గ్రామస్థులు శాంతించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు దమ్మయ్యగారి భానుచందర్, నాయకులు శంకర్‌గౌడ్, రొయ్యల వినయ్ కుమార్, భరత్, రాజయ్య, వినోద్ కుమార్‌రావు, బాబాగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఎబివిపి నాయకులు



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి

**హత్నూర, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని హత్నూర మండలంలో శుక్రవారం జరుపుకున్నారు. మండలంలోని నస్తీపూర్ గ్రామంలో డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. నస్తీపూర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా సామాజిక హక్కుల సంఘం( సాహసం) సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వరిగుంతం కృష్ణ, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి ఘన నివాళులు అర్పించారు.

**గుండ్లమాచునూర్‌లో...**
గుండ్లమాచునూర్ గ్రామంలో అంబేద్కర్ 68 వర్ధంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా సమద సైనిక్ దల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దళితరత్న సాయమోళ్ల నర్సింగ్‌రాజ్, స్థానిక నాయకులు శంకర్, శ్రీనివాస్, దుర్గయ్య, మహేష్, లోకేష్, గౌతమ్, సంపత్, బాలయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డిలో...**
**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, శుక్రవారం ఫోరమ్ నాయకులు, సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్, మహేంద్ర ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్‌కుమార్‌తో సహ కార్యదర్శి గడ్డం పాండురంగం, కార్యవర్గసభ్యులు సాయి వరాల, అంబేద్కర్‌కాలనీ వాసులు బర్ల శంకర్, విట్టల్, ఎలీషా, రాములు, సంగన్న, నరేష్, సాయిలు పాల్గొన్నారు.

**ఘనంగా అంబేద్కర్ వర్ధంతి...**
నర్సాపూర్, డిసెంబరు 6, ప్రభాతవార్త: నర్సాపూర్ పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు ప్రజా గాయకుడు అల్లిపూర్ రమేష్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**రామాయంపేటలో...**
**రామాయంపేటమున్సిపాలిటీ,డిసెంబరు6, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీలో భారత రాజాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మెదక్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఒద్ది స్వామి, కుందెన శ్రీకాంత్, కుందెన నాగరాజు, ఆసాదు ప్రవీణ్, బైరం నాగప్రశాంత్, గావు కృష్ణ, గావు శ్రీకాంత్, గావు స్వామి, నిమ్మల కళ్యాణ్, బైరం ప్రవీణ్, ఆసాదు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఎబివిపి ఆధ్వర్యంలో...**
**రామాయంపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త:** రామాయంపేట మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎబివిపి నాయకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెదక్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చెప్పిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, నగర కార్యదర్శి హరి, సంయుక్త కార్యదర్శి నవీన్, ఎబివిపి నాయకులు జస్వంత్, కిరణ్, వంశీ, నరేందర్ పాల్గొన్నారు.

**గుమ్మడిదలలో...**
**గుమ్మడిదల, డిసెంబరు 6, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల కేంద్రంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తుడుం శ్రీనివాస్, మండల అధ్యక్షులు నీరు రమేష్, గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తుడుము రవి, ఆర్గనైజర్ సెక్రెటరీ తుంకి సుధాకర్, లక్ష్మణ్, బిజెపి మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు యాదగిరి, రాంరెడ్డి, కానుకుంట అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రమేష్, ఐలయ్య, మైనార్టీ సంఘం నాయకులు ఆయుబ్, నాగరాజు పాల్గొన్నారు.

## జోగిపేట సిఐపై చర్యలకు డిమాండ్



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
ఫోటో జర్నలిస్టు కృష్ణ పట్ల దురుసుగా ప్రవర్తించిన జోగిపేట సిఐ అనిల్ కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేస్తూ, సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి అధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సిఐ అనిల్ కుమార్ వ్యవహరించిన తీరును జర్నలిస్ట్ సంఘం నాయకులు జిల్లా ఎస్పీకి వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్య తీసుకోవాలని ఎస్పీని కోరారు.

ఈ ఘటనపై అడిషనల్ ఎస్పీతో విచారణ జరిపించి తగిన చర్య తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జర్నలిస్టు సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా సంఘం అధ్యక్షులు యాదగిరి ప్రధాన కార్యదర్శి విష్ణు జర్నలిస్ట్ హౌస్ సైట్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమర్ హుస్సేన్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు సిద్దిక్, జిల్లా సంఘం నాయకులు అజిత్, ఆరిఫ్, శ్రీనివాస్, దండు ప్రభు, డేవిడ్, రవి, శ్రీను, పాండు, యాదగిరి, సతీష్, మురళీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరును కలిసి జోగిపేట సిఐ అనిల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## నాగ్సాన్‌పల్లిలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



నాగ్సాన్‌పల్లిలో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న యువకులు

**పాపన్నపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో శుక్రవారం అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యువత సమాజ స్థాపనకు అంబేద్కర్ అడుగుజాడల్లో ముందుకు సాగాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో మాణయ్య, ఏసోబు, సూర్య సింహ, దినకర్, బాబు, రాజకుమార్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ

**కొల్చారం, డిసెంబరు 6, ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని అప్పాజీ పల్లి గ్రామంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వాములు ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం మండలాధ్యక్షులు నాయిని వెంకట్‌గౌడ్‌స్వామి స్వగృహంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంలో గురుస్వాములు శంకర్ స్వామి, హరిదాస్‌స్వామిల ఆధ్వర్యంలో 18మెట్ల మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తిగీతాలతో గ్రామమంతా మార్మోగింది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం ప్రత్యేకపూజలు చేసి 18మెట్లలో జ్యోతి వెలిగించి మహాపడిపూజ చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమకేసులు పెట్టడమేనా ప్రజాపాలన అంటే?



బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

**గుమ్మడిదల, డిసెంబరు 6, ప్రభాతవార్త:** ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెట్టడమేనా ప్రజాపాలన అంటే అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద కౌశిక్‌రెడ్డి, మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులను అక్రమంగా అరెస్టుచేసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ముందస్తుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిలను వారి నివాసాల వద్ద నుండి అరెస్టుచేసి గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. ప్రజల పక్షాన ప్రతిపక్షంగా ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకులపై కక్షపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తుపాకుల రాజు, వాసుదేవ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, శేఖర్ గౌడ్, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, ఘటాటి రమేష్, యాదగిరి, సుధాకర్ రెడ్డి, మహేష్ యాదవ్, హరికృష్ణ, శ్రీశైలం, కాంతారావు ,రాజు, బక్క సత్యనారాయణ, ఆంజనేయులు, యూనస్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలతో ఏదైనా సాధ్యమే

**రామాయంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:** మహిళలు తలుచుకుంటే సాధించలేనిదేమీ లేదని ఎస్సీ కార్పొరేషన్ విసి ఎండి క్షితిజ అన్నారు. రామాయంపేట మండలకేంద్రంలో శుక్రవారం న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా న్యాక్ ఆధ్వర్యంలో 100రోజులపాటు ప్రగతి ధర్మారం, కోనాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 50మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు శుక్రవారం కుట్టుమిషన్లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్సీ కార్పొరేషన్ కృషి చేస్తుందన్నారు. వివిధరంగాల్లో శిక్షణనిచ్చి వారికి రుణాలు పంపిణీచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

## బాలికలు, మహిళలు రక్షణచట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న లలిత కుమారి

**సంగారెడ్డిమున్సిపాలిటీ,డిసెంబరు6, ప్రభాతవార్త:**
జిల్లా మహిళాశిశుసంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి మహిళా పోలీస్‌స్టేషన్‌ను కిశోర బాలికలు సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమ శాఖాధికారిణి కె.లలితకుమారి మాట్లాడుతూ బాలికలు శిశుసంక్షేమశాఖ నుంచి అందిస్తున్న సేవలను, అవగాహన కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. సరైన పోషకాహారం తీసుకుని మంచి ఆరోగ్యంతో పాటు విద్యను అభ్యసించి ఉన్నతాభివృద్ధి సాధించాలని సూచించారు. హెల్ప్ లైన్ నెంబర్స్ 1098,181 ని అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ ప్రమీల మాట్లాడుతూ వారు చేస్తున్న సేవలను, చట్టాలను, శిక్షలను వివరించారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలు విద్యమీద దృష్టి పెట్టాలని, సోషల్ మీడియా వంటి వాటికి దూరంగా వుండాలన్నారు. 100 నెంబర్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకొని ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సునీత బాయ్, జిల్లా మహిళాసాధికారిత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, సఖి దితి కల్పన, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, భరోసా సమన్వయకర్త దేవా లక్ష్మి, పోలీస్ ఉమెన్ శాఖకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖాధికారిని కె.లలితకుమారి, విద్యార్థినులు భరోసా సెంటర్‌ను సందర్శించారు.

## పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు

**నారాయణఖేడ్, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని హంగిర్గా(కె) గ్రామానికి చెందిన పోలీసు కానిస్టేబుల్ చెన్నేశ్వరి నిజాంపేట పిఎస్‌లో గత కొద్దిరోజుల క్రితం కానిస్టేబుల్‌గా పనిచేసింది. ఆమె ఉద్యోగరీత్యా ఎస్‌బిఐ లైఫ్ స్మార్ట్ స్వధాన్ పాలసీ కింద సంవత్సరానికి రూ.32000 రిటర్న్ ఆఫ్ టర్మ్ పాలసీ చెల్లించింది. చెన్నేశ్వరి డెలివరీ సమయంలో కవల పిల్లలకు జన్మనిచ్చి అనారోగ్య పరిస్థితుల వల్ల ఆమె మరణించింది. ఇన్సూరెన్సు ద్వారా ఆమె కుటుంబ సభ్యులైన భర్త చికోడ్ ఆకాష్‌కు రూ.21 లక్షల చెక్కును ఎస్‌బిఐ సంగారెడ్డి డివిజనల్ మేనేజర్ ఎ.పవన్‌కుమార్ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ పివి సాయికిషోర్, డెవలప్‌మెంటు మేనేజర్లు దత్తారెడ్డి, గోపాల్, పండరి, లైఫ్‌మిత్ర నిరంజన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ

**శివ్వంపేట, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండలంలోని పాంబండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అశోక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ 105మంది విద్యార్థులకు స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ మాట్లాడుతూ తను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నత స్థాయికి ఎదిగానని విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు స్వెటర్ల పంపిణీకి కృషిచేసిన తెలుగు ఉపాధ్యాయులు వామనశర్మను అభినందించారు. స్వెటర్లు అందజేసిన హైకోర్టు సీనియర్ న్యాయవాదికి విద్యార్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్ననాయక్, జగదీశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**కొల్చారం, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కొల్చారంలలో శుక్రవారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, బహుజన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు గోసికె యోహాన్‌లు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహా గొప్ప వ్యక్తి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు అల్లి ప్రసాద్, నాయకులు దేవన్నగారి శేఖర్, ఆశన్నగారి శ్రీశైలం, మహేశ్వర్ రెడ్డి, గొల్ల కృష్ణయ్య, మన్నె శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, అశోక్, అక్రమ్, రూప్ల నాయక్, పాండు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కొల్చారం, డిసెంబరు 6, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని నాయిని జలాలపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్గు మల్లేశం కొడుకు దగ్గు గణేష్ ఇటీవల అనారోగ్యంతో మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 42 వేల రూపాయకల చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మంజూరు చేయగా చెక్కును శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, మాజీ సర్పంచ్ కర్రె లచ్చయ్య, కొంగోడు మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్‌ల చొరవతో బాధితునికి నాయిని జలాలపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ పంచాయతీలో ఆవరణలో అందజేశారు. చెక్కును మంజూరు చేయించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు దగ్గు మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవులు, పిపిఎస్ డైరెక్టర్‌లు నాయిని శేషగిరి, దుర్గయ్య, దాసు, రామచందర్, గిర్ని రాములు, ఏగొండ, ఆగమయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ నర్సింలు, సోమయ్య, పెంటయ్య, శంకరయ్య తదితరులు ఉన్నారు.